సాక్షి సూర్యాపేట

మంగళవారం । 5 । మార్చి । 2024



ముగ్గురు మృతి..
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. - 8లో



ఆటోడ్రైవర్ నిజాయితీ
ఓ మహిళ పోగొట్టుకున్న నల్లపూసల గొలుసు ఆటోడ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. - 8లో



ఆత్మహత్యాయత్నం
కోడలు ఇబ్బందులకు గురిచేస్తుందని వృద్ధ దంపతులు ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా లత బాధ్యతల స్వీకరణ



బీఎస్.లత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బీఎస్.లత సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆమె కలెక్టర్ ఎస్. వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ శాఖల అధికారులు ఆమెకు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇక్కడ పనిచేసిన ఎ. వెంకట్‌రెడ్డిని ఇటీవల బదిలీ అయిన విషయం విదితమే.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో 1 నుంచి పీజీ వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి బి.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. కళాశాలల నుంచి దరఖాస్తుకు కుల ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు, ఆధార్‌కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం (1,00,000/-లోపు), వైకల్య ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్ జతపర్చాలని సూచించారు. ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అదనంగా కళాశాల ప్రభుత్వ గుర్తింపు పత్రం జతపర్చాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

భద్రతా నియమాలు పాటించాలి



హుజూర్‌నగర్: ఉద్యోగులతో భద్రత ప్రతిజ్ఞ చేయిస్తున్న టీఎస్ జెన్‌కో ఎస్ఈ దేశ్యా

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : విద్యుత్ ఉద్యోగులు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని టీఎస్ జెన్‌కో ఎస్ఈ దేశ్యా సూచించారు. చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టులో గల టీఎస్ జెన్‌కోలో సోమవారం జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. విధుల నిర్వహణలో ప్రమాదాలు జరగకుండా ఉద్యోగులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రత్నం, ఏడీఈలు బెన్హర్, రమేష్‌బాబు, సంతోష్ కుమార్, గిరి, సక్రూ, దుర్గా భవాని, కుసుమ కుమారి, మాధవి, మహాలక్ష్మి, ఏఈలు అపర్ణ, తన్వీర్, రాకేష్, ఏఏఓ వెంకటేశ్వర్లు, జేపీఏలు శ్రీనివాస్, రామయ్య, జేఏ హుస్సేన్‌రెడ్డి, రామారావు, హమీద్ పాల్గొన్నారు.

శివాలయం నూతన పాలకమండలి నియామకం



నియామక పత్రాలతో నూతన చైర్మన్, సభ్యులు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయానికి నూతన పాలకమండలి సభ్యులను నియమిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఉత్తర్వు కాపీలను ఆలయ కార్యనిర్వహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి నూతన సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులుగా గుగులోతు పద్మ, మామిడి గణేష్, కర్నాటి సత్యనారాయణరెడ్డి, ఉన్నూరు వెంకటేశ్వర్లు, చిన్నపంగు చిన్నబాబు, శాగంరెడ్డి గోవిందరెడ్డి, స్కురబోయిన చందర్‌రావు, పందిరి నాగిరెడ్డి, ఓరుగంటి నరసింహారావు, పసుపులేటి శంభయ్య, ఉప్పతల్ల శంకర్, భావన వెంకటేశ్వర్‌రావు, కొంకపాక శివ విష్ణువర్ధణశర్మ నియమితులయ్యారు. కార్యక్రమంలో కొట్టె సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, కాకునూరి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు రామకృష్ణ, శంభయ్య పెద్దలు మరిశెట్టి అచ్యుతరావు, ఇరిగెల పోలిరెడ్డి, గుజ్జుల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

అర్వపల్లి: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటా చలం సూచించారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండలంలోని వివిధ గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన పరిశీలించిన అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేసి మాట్లాడారు. పోలియోరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ, మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ మణిదీప్, సీహెచ్ఓ ఎల్. చరణ్, ఎంపీహెచ్ఏ కె. వీరయ్య, ఫార్మసిస్ట్ మాధవి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ.. రైతు వ్యతిరేకి



మాట్లాడుతున్న ఇందూరు సాగర్

నూతనకల్ : ప్రధాని నరేంద్రమోదీ రైతు వ్యతిరేకి అని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ ఆరోపించారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణగౌడ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని దివాళాతీయడానికి రైతు చట్టాలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రైతులు జరిపిన ఉద్యమాలతో ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న రైతులపై కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు. మోదీఫాసిస్ట్ విధానాలపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీవైఎల్ నాయకులు జటంగి సతీష్, బొమ్మిడి నగేష్, మూరగుండ్ల మధు, నర్సింహ, వెంకటేష్, వెంకన్న, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్

సూర్యాపేటటౌన్ : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేషులు పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, ఉమ్మడి నల్లగొండకు చెందిన రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర నియంత్రణ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లు సుధాకర్, సంపతయ్యలు వివరించారు. వ్యాస రచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే యువజన అధికారి ప్రవీణ్, కొండ నాయక్, మణికంఠ, మధు, నవీన్, సాగర్ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీతో ఊరట

- ఆస్తి పన్ను బకాయిల మొత్తం 10శాతం వడ్డీతో చెల్లిస్తే చాలు
- 90 శాతం వడ్డీ మాఫీ పొందే అవకాశం
- మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ
- నెలాఖరుతో ముగియనున్న గడువు



తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ మున్సిపల్ శాఖ ఊరట కల్పించింది. పన్ను బకాయిలపై మున్సిపాలిటీ వాసులకు ఇది తీపి కబురు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని పది శాతం వడ్డీతో ఏక కాలంలో చెల్లించి వడ్డీలో 90 శాతాన్ని మాఫీ పొందే అవకాశాన్ని వన్ టైమ్ సెటిల్ మెంట్ కింద కల్పిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీ రాయితీ మొత్తాన్ని అడ్వాన్స్ రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరం పన్ను నుంచి మినహాయించి ప్రయోజనం చేకూర్చనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. భవనాలు, ఖాళీ స్థలాల పన్నులపై ఈ సదుపాయం వర్తిస్తుంది.

మున్సిపాలిటీ	భవనాలు	పన్ను డిమాండ్	వసూలు	బకాయిలు
		(రూ.కోట్లలో)		
సూర్యాపేట	33,983	1167.48	854.09	627.57
కోదాడ	16,283	453.08	353.16	253.65
హుజూర్‌నగర్	7,948	174.26	120.28	88.10
తిరుమలగిరి	5,333	100.62	78.3	35.2
నేరేడుచర్ల	3,807	78.90	60.3	36.72

ముమ్మర ప్రచారం..
వడ్డీరాయితీపై జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో మైకుల ద్వారా సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్‌ల వేదికలుగా ముమ్మర ప్రచారం సాగిస్తున్నారు. ఈ నెల 31వరకు బకాయిలను, వడ్డీ మొత్తంలో కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు. పన్ను వసూళ్లను బిల్ కలెక్టర్లు వేగవంతం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో భవన యజమానులకు వడ్డీ ఊరట కలిగించింది. మున్సిపాలిటీల్లో పన్నులు వేగవంతంగా వసూలై ఆదాయం దక్కుతుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రామదుర్గారెడ్డి, కమిషనర్, తిరుమలగిరి

భూ సమస్యలపై సత్వరమే స్పందించాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు. చిత్రంలో అదనపు కలెక్టర్ లత

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో భూసమస్యలపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ భూ సమస్యలపై 92 దరఖాస్తులు, ఇతర శాఖల నుంచి 39 ఇలా మొత్తం 131 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. వేసవి దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో నీటి ఎద్దడి రాకుండా సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో జాబ్ కార్డ్ ఉన్న కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. ప్రజాపాలన సేవ కేంద్రాల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ కార్యక్రమాలు నియోజకవర్గాల వారీగా చేపట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు విధులు సమర్థంగా నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీపీఓ సురేష్ కుమార్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈ నెల 8న నిర్వహించనున్న మేళ్లచెర్వు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాతర ఏర్పాట్లపై జిల్లా అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, శాఖల వారీగా నిర్దేశించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. లైటింగ్, వాహనాల పార్కింగ్, ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణం చుట్టూ చదును చేసి ప్రభల ఏర్పాట్లకు సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రూట్లలో బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. శానిటేషన్, భక్తులకు తాగునీరు ఏర్పాట్లు పరిశీలించాని డీఎల్పీఓ, ఎంపీడీఓలు , తహసీల్దార్‌లకు సూచించారు. తాత్కాలిక టాయిలెట్ల నిర్మాణం, మహిళలకు ప్రత్యేకంగా షీ- టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయం చుట్టుపక్కల నిరంతర కరెంటు ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్, సూపరింటెండెంట్ పద్మారావు, రోడ్లు భవనాల శాఖ అధికారిణి ప్రియదర్శిని, ఎంపీడీఓ ఆలీ ,ఆర్టీసీ డీఎం సురేందర్, తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

తిరుమలగిరి మున్సిపాలిటీలో 20న అవిశ్వాసం

- మున్సిపల్ కౌన్సిలర్లకు నోటీసులు జారీ



జిల్లా కలెక్టర్ వెంకట్రావుకు తీర్మానం కాపీ అందజేస్తున్న కౌన్సిలర్లు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సి పల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం 2గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కలెక్టర్ వెంకట్రావు నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ రామదుర్గారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులు సోమవారం నోటీసులు అందజేశారు.

మారిన రాజకీయం
తిరుమలగిరి, మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలతో కలిపి తిరుమలగిరి మున్సిపాలిటీని 2018లో ఏర్పాటు చేశారు. మొదటిసారి 2020జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. మొత్తం 15వార్డులకు గాను ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 11, కాంగ్రెస్ నుంచి నలుగురు కౌన్సిలర్లు గెలుపొందారు. బీఆర్ఎస్‌కు చెందిన వారే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ అయ్యారు. కొన్ని రోజుల తర్వాత రెండో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 4వ వార్డు కౌన్సిలర్ బత్తుల శ్రీను, 7వ వార్డు కౌన్సిలర్ సరళాయాదవరెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ గిలకత్తుల ప్రియల తారాము గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం వీరితో పాటు బీజేపీలో చేరిన కౌన్సిలర్, మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీ మారనప్పటికీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారు. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడైన స్థానిక శాసన సభ్యుడితో కలుపుకుంటే వీరి బలం 11కు చేరింది.

క్యాంపులో కౌన్సిలర్లు
అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మారిన రాజకీయపరిణామాల నేపథ్యంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు నిర్ణయించుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి గత నెల 26న కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీన జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌కు నేరుగా హాజరు కానున్నట్లు సమాచారం. ఇప్పటికే తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. నూతన చైర్మన్‌గా గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డిని ఎన్నుకున్నారు.ఇక తిరుమలగిరి మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ పెట్టాలని కలెక్టర్ వెంకట్రావు నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్‌పై, మధ్యాహ్నం 2 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. గత నెల 26వ తేదీన తిరుమలగిరి మున్సిపాల్టికి చెందిన పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కాపీపై సంతకం చేసి జిల్లా కలెక్టర్‌కు స్వయంగా అందజేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం కోసం ఈ నెల 20వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మున్సిపాల్టి అధికారులు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సోమవారం నోటీసులు అందజేశారు.

విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం

- ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖి
- నల్లగొండలో విద్యుత్‌శాఖ నెలవారీ సమీక్ష
- విధుల్లో అలసత్వం వహించిన మిర్యాలగూడ డీఈపై బదిలీ వేటు
- అధికారులు పనితీరు మార్చుకోకుంటే డిస్మిస్ చేస్తామని హెచ్చరిక



నల్లగొండ : విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించమని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖి పేర్కొన్నారు. విద్యుత్ శాఖ నెలవారీ సమీక్ష సమావేశం సోమవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో గల సబ్‌స్టేషన్ మీటింగ్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, జేఏఓలు, ఏఈలు హాజరయ్యారు. ఇటీవల త్రిపురారం మండలంలో తరచూ ఎల్‌సీ తీసుకుంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దానిపై సీఎండీ మిర్యాలగూడ డీఈని వివరణ కోరగా.. పొంతన లేని సమాధానం చెప్పాడు. ఆ సంఘటనకు సంబంధించి షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చావా అంటూ సీఎండీ ప్రశ్నించగా.. ఇవ్వలేదని చెప్పడంతో సీరియస్ అయిన సీఎండీ గెటవుట్ అంటూ సమావేశం నుంచి బయటకు పంపారు. ఆ తర్వాత ఆ డీఈని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించి.. ఆర్డర్లు ఇవ్వాలని కార్పొరేట్ ఆఫీస్ పీఆర్ఓను ఆదేశించారు. కొద్దిసేపటికే డీఈని మిర్యాలగూడ నుంచి బదిలీ చేస్తూ హైదరాబాద్ సీజీఎం ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని.. ఆయన స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించాలని నల్లగొండ ఎస్ఈకి ఆదేశాలు అందాయి. అయితే సమావేశంలో డీఈని సస్పెండ్ చేస్తున్నట్లు సీఎండీ చెప్పిన రెండు గంటల్లోనే ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం.

అర్హులకు 'గృహజ్యోతి' అందేలా చూడాలి
ప్రస్తుతం పంట పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని అధికారులను సీఎండీ ఆదేశించారు. ప్రభుత్వం గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నందున అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్ఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ శంకరయ్య, జేఏవోలు, ఇతర జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశాలు..
11 కేవీ ఫీడర్లలో అంతరాయం ఏర్పడుతోందని జిల్లా మొత్తం తిరిగి పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు జరగకుండా చూడడంతోపాటు వారం రోజుల్లోగా రిపోర్ట్ ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించినట్లు తెలిసింది. వారంలోగా సమస్య పరిష్కారం కాకపోతే పదిరోజుల తర్వాత తానే వచ్చి చూస్తానని పనితీరులో మార్పు రాకపోతే అధికారులను డిస్మిస్ చేస్తానని హెచ్చరించినట్లు సమాచారం.

నల్లగొండ డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు
విద్యుత్ శాఖ మిర్యాలగూడ డీఈ వెంకటేశ్వర్లును బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్ఈ చంద్రమోహన్ ఆ స్థానంలో నల్లగొండ విద్యుత్ డీఈ సంగెం వెంకటేశ్వర్లుకు పూర్తిస్థాయి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

స్లాట్‌రద్దు సొమ్ము రాలే

- బాధిత రైతుల ఖాతాల్లో జమకాని పైకం
- ధరణి అమలు తరువాత మూడేళ్లుగా ఇదే తంతు
- జిల్లాలో 2 వేల మంది ఎదురుచూపు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : భూముల రిజిస్ట్రేషన్ కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాలతో రద్దు చేసుకున్న రైతుల సొమ్ము తిరిగి రావడం లేదు. ధరణి నిబంధనల ప్రకారం స్లాట్ బుక్ చేసుకునే సమయంలో మీ సేవ కేంద్రాల్లో చెల్లిస్తున్న సొమ్ములు.. స్లాట్ రద్దయిన పక్షంలో తిరిగి చెల్లించాలనే నిబంధన ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2వేల మంది స్లాట్ రద్దు సొమ్ముకోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిలో మార్పులు తీసుకొచ్చిన నేపథ్యంలో తమ డబ్బు తిరిగి చెల్లిస్తుందన్న ఆశతో ఉన్నారు.

జిల్లాలో 2 వేల మంది..
భూముల క్రయ విక్రయాలు పారదర్శకంగా ఉండాలని గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను 2020లో అందుబాటులోకి తీసుకు వచ్చింది. భూ రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన రుసుములు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల స్లాట్‌ను రద్దు చేసుకున్నా, ఇతర కారణాలతో స్లాట్ రద్దు అయినా మీ సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి చెల్లించిన సొమ్ములు తిరిగి రైతుల ఖాతాలో జమ కావాల్సి ఉంది. కానీ అలా కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలో ఇలా స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత రద్దయితే సొమ్ము తిరిగి రానివారు సుమారు 2వేల మంది వరకు ఉన్నారు. వారంతా ఎదురు చూస్తున్నారు.

ఎవరిని అడగాలో తెలియక..
వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు మీ సేవలో ఆయా ప్రాంతాల్లో భూమి విలువ ఆధారంగా నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకుంటారు. స్లాట్ కేటాయించిన రోజున సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాల సమక్షంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తారు. వివిధ కారణాలతో కొంత మంది రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకుంటున్నారు. కొన్నింటిని అధికారులే అనుమతించడం లేదు. వారికి ధరణి నిబంధల ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం మీ సేవలో స్లాట్ బుకింగ్ సమయంలో చెల్లించిన సొమ్ము తిరిగి రైతు ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అలా జరగక పోవడంతో వాటి కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ధరణిలో భూ విక్రయాలు నిలిచిపోయిన క్రమంలో చెల్లింపులకు సంబంధించిన వివరాల గురించి ఎవరిని అడగాలో తెలియక స్లాట్ బుక్ చేసుకున్న వారు తికమకపడుతున్నారు. ఎకరం భూమి రిజిస్ట్రేషన్‌కు సేల్‌డీడ్‌కు 4 శాతం, గిఫ్ట్‌డీడ్‌కు 3శాతం రుసుము చలానా రూపంలో ప్రభుత్వ ఖజా నాకు జమ చేస్తున్నారు. చివరి క్షణాల్లో వారసత్వ భూముల విషయంలో సమస్యలు తలెత్తడం, మిస్సింగ్ సర్వే నంబర్లు ఉండటం, ఆన్‌లైన్లో సర్వే నంబర్లు కనిపించకపోవడం, భూవిక్రయంపై అభ్యంతరాలు రావడం, వ్యక్తిగత కారణాలతో చివరి క్షణంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. మూడేళ్లుగా స్లాట్ రద్దయిన వారికి సొమ్ములు అందడం లేదనే ఆరోపణలున్నాయి.

'రెవెన్యూ'కు సంబంధంలేదు..
వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని, ఆ తరువాత రద్దు చేసుకున్న వారికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలోకి చలానా సొమ్ము జమ చేస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. స్లాట్ రద్దయిన వెంటనే సొమ్ము తిరిగి చెల్లించడం అనే విషయంతో రెవెన్యూ శాఖకు సంబంధం లేదని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వివరిస్తున్నారు.

క్లుప్తంగా

యాదాద్రిలో గాయకుడు ఎస్పీ చరణ్ పూజలు


పూజలు చేస్తున్న సింగర్ ఎస్పీ చరణ్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని సినీ గాయకుడు ఎస్పీ చరణ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన ఉత్సవ మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న ఎస్పీ చరణ్‌కు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ : అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు డీటీసీఎస్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

వివిధ కేసుల్లో పలువురికి జరిమానా

హుజూర్‌నగర్ : మద్యం సేవించి వాహనాలు నడపడం, ఇసుక అక్రమ రవాణా లాంటి పలు నేరాలకు పాల్పడిన పలువురికి హుజూర్‌గనర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ సోమవారం జరిమానా విధించారు.వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల మండలంలో 14 మంది, చింతలపాలెం, గరిడేపల్లి మండలాల్లో ఇద్దరు చొప్పున, హుజూర్ నగర్, మేళ్లచెరువు మండలాల్లో 5గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. అంతే కాకుండా చింతలపాలెం మండలంలో ఇద్దరు వ్యక్తులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారందరిని కోర్టుకు రిమాండ్ చేయగా వారు న్యాయమూర్తి ఎదుట తమ నేరాలను అంగీకరించారు. దీంతో వారందరికి కలిపి రూ 28 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మారుతి ప్రసాద్ తీర్పు చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్

హుజూర్‌నగర్ : అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జురెడ్డి సోమవారం తెలిపారు. పాలకవీడు మండలంలోని డీసీఎల్ సమీపంలో మద్యం విక్రయిస్తున్న రావిపహాడ్‌కు చెందిన కోటమ్మ, సైదమ్మలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 12బీర్లు, 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

తుర్కపల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నాగపురి సత్తయ్య (65) ఉదయం ఇంటి నుంచి టీవీఎస్ లూనాపై కొడుకు ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్య తలకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు అతడిని భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాములమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సత్తయ్య మృతదేహం

ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొని..

నార్కట్‌పల్లి: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన గుండ్ల ఉమేష్ తన భార్య మమతతో కలిసి సోమవారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గ మధ్యలో నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి ఆర్చి వద్దకు రాగానే బైక్ ముందు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో ఉమేష్ బైక్ అదుపుతప్పి ఆ ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉమేష్ (30) మృతిచెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

డీసీఎం ఢీకొని రైతు..

చింతపల్లి : చింతపల్లి మండల పరిధిలోని కుర్రంపల్లి గ్రామానికి చెదిన సమ్మిడి పాండురంగారెడ్డి(68) గ్రామంలో వ్యవసాయ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోటారు సైకిల్‌పై హైదరాబాద్ వెళ్లి తిరిగి స్వగ్రామమైన కుర్రంపల్లికి సోమవారం వస్తుండగా మల్లేపల్లి వైపు నుంచి వస్తున్న డీసీఎం వాహనం ఎదురుగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య విజితారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

ఉపాధ్యాయుల అసభ్యకర ప్రవర్తన

- డైట్‌లోని 4వ తరగతి విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫిర్యాదు
- పాఠశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన
- విచారణకు ఆదేశించిన డీఈఓ

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని డైట్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఆ పాఠశాలలో 4వ తరగతి చదుతున్న విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు సోమవారం పాఠశాలకు వచ్చి ఆందోళన చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓ భిక్షపతి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. నల్లగొండ ఎంఈఓ అరుంధతి పాఠశాలలో విద్యార్థినులు, తోటి ఉపాధ్యాయులను విచారించారు. ఆ తర్వాత తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. టూటౌన్ పోలీసులు పాఠశాలకు చేరుకుని సంఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు. ఓ ఉపాధ్యాయుడిని పోలీసులు తీసుకెళ్లారు. విచారణకు వచ్చిన అధికారులకు తమ పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించారని విద్యార్థినులు తెలిపారు. కొంత కాలంగా ఇద్దరు ఉపాధ్యాయులు తమను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విచారణ అధికారుల ఎదుట వారు వాపోయారు. ఇదిలా ఉంటే ఈ సంఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టీచర్ల మధ్య విభేదాల కారణంగా పిల్లలను ఉసిగొల్పి తప్పుడు ఫిర్యాదులు చేయించారన్న చర్చ జరుగుతోంది. దీనిపై డీఈఓ భిక్షపతిని వివరణ కోరగా విచారణ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కలెక్టరేట్‌లో దంపతుల ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు
- జీవనభృతి కల్పించకుండా కోడలు ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపణ

దురాజ్‌పల్లి(సూర్యాపేట), మునగాల : కోడలు జీవనభృతి కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఓ వృద్ధ దంపతులు సూర్యాపేట కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసుకోబోగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రానికి చెందిన వృద్ధ దంపతులు పిడమర్తి ఎలిషమ్మ, వెంకన్న దంపతుల కుమారుడు పిడమర్తి చిరంజీవి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద ఇంటలిజెన్స్ కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. రజినిని కులాంతర వివాహం చేసుకున్నాడు. విధి నిర్వహణలో భాగంగా 2022 జూన్ 6న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో రజినికి డీజీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఆ వృద్ధదంపతులు పోషణ కోసం 2023 ఆగస్టులో కోదాడ ఆర్డీఓను సంప్రదించగా నెలకు రజిని ఆమె వేతనం నుంచి రూ.5వేలు ఇచ్చేలా నిర్ణయించారు. అయినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఎలిషమ్మ, వెంకన్న దంపతులు ఆరోపించారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టరేట్ బయటి గేట్ దాటి లోపలికి వచ్చి కూర్చున్నారు. వారిని చూసి ఎందుకు వచ్చారని పోలీసులు ఆరా తీశారు. కోడలు జీవనభృతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చినట్లు బోరున విలపిస్తూ తెలిపారు. వెంటనే పోలీసులు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్‌లో వెతకగా పురుగుల మందు డబ్బా కన్పించింది. దానిని పోలీసులు తీసుకుంటుండగానే ఎలిషమ్మ లాక్కొని మూతతీసి తాగబోయింది. వెంటనే వారు అడ్డుకున్నారు. వారిద్దరిని అదనపు కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. వారు గోడు వెల్లబోసుకొని వినతిపత్రం అందించారు. న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.


కలెక్టరేట్ వద్ద విలపిస్తున్న వృద్ధ దంపతులు, చిత్రంలో కవర్‌లో వెతుకుతున్న కానిస్టేబుల్, వారి వద్ద లభించిన పురుగుల మందు డబ్బా

అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు : సోషల్ మీడియా వేదికగా అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై సోమవారం అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన గూడెపు పరమేష్ ఈ నెల 2న అడ్డగూడూరు ఎస్‌ఐపై దురుద్దేశంతో అసత్యపు ఆరోపణలు సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ సైదాబాబు

చిట్యాల: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆదివారం ఆ గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రాపోలు రాజు పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేయగా 60 గ్రాముల గంజాయి లభ్యమైంది. విచారణలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల ద్వార గంజాయిని తీసుకువచ్చి గ్రామంలోని పలువురు యువకులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

పత్తి గోదాములో అగ్ని ప్రమాదం

- రూ.20కోట్ల విలువైన పత్తి దగ్ధం


గోదాములో ఎగిసి పడుతున్న మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వలిగొండ : పత్తి గోదాములో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రూ. కోట్ల విలువైన పత్తి దగ్ధమైంది. ఈ ఘటన వలిగొండ మండలంలోని టేకులసోమారంలో చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం సమయంలో గోదాములో ప్రమాద వశాత్తు భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని అక్కడి సిబ్బంది గమనించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంతాలనుంచి ఫైర్ ఇంజన్లు రప్పించి మంటలు ఆర్పుతున్నారు. ప్రమాదంలో సుమారు రూ.20కోట్ల విలువైన పత్తి దగ్ధమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి జయకృష్ణ, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదర్‌రెడ్డి, రామన్నపేట, చౌటుప్పల్ సీఐలు వెంకటేశ్వర్లు, రాము, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ఎస్‌ఐ మహేందర్ లాల్ పర్యవేక్షనలో మంటలు ఆర్పిస్తున్నారు. షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లో ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైన భూదాన్‌పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ గ్రామానికి చెందిన వాకిటి లక్ష్మమ్మ (58) చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. అయితే కొద్ది రోజులుగా వెన్నునొప్పితో బాధపడుతున్న లక్ష్మమ్మ ఆదివారం ఉదయం ఇంటి నుంచి హయాత్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడానికి వెళ్లింది. అక్కడ రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఈమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి కోమాలోకి వెళ్లిన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది.


లక్ష్మమ్మ (ఫైల్)

మాతృమూర్తి నేత్రాలు దానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మృతురాలి కుమారులైన వాకిటి బాల్‌రెడ్డి, వాకిటి జంగారెడ్డిలు తన మాతృమూర్తి నేత్రాలను దానం చేయాలని నిశ్చయించుకొన్నారు. దాంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి కళ్లను తీసుకెళ్లారు. తన తల్లి మరణించిన ఆమె మరో ఇద్దరి జీవితాలకు వెలుగులు నింపినందుకు ఎంతో గర్వంగా ఉందని కుమారులు పేర్కొన్నారు. తల్లినేత్రాలను దానం చేసిన వీరిని గ్రామస్తులు, పలువురు అభినందించారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

అడవిదేవులపల్లి : ఓ మహిళ పోగొట్టుకున్న నల్లపూసల తాడును ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి ఎకుల మహేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మహేష్ తన ఆటోలో గత నెల 25వ తేదీన అడవిదేవులపల్లి నుంచి మిర్యాలగూడకు వెళ్తుండగా లావూడితండా వద్ద పెద్దవూర మండలం పులిచర్ల గ్రామ సమీపంలో కోమటికుంట తండాకు చెందిన రమావత్ లక్ష్మి ఇతడి ఆటో ఎక్కింది. దీంతో సదరు మహిళ మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద ఆటో దిగి స్వగ్రామానికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆ మహిళ మెడలో ఉన్న నల్లపూసల తాడు తెగి ఆటోలో పడిపోయింది. ఆ విషయాన్ని గమనించిన ఆటో డ్రైవర్ మహేష్ నల్లపూల తాడును భద్రపరిచి సోషల్ మీడియాలో ప్రచారం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు మహిళ ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి ఆ వస్తువు నాదే అని చెప్పింది. దీంతో మహేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ హరిబాబుకు ఆ వస్తువును అప్పగించాడు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం బాధితురాలికి ఎస్‌ఐ హరిబాబు అందజేశారు.


బాధితురాలికి నల్లపూసల తాడు అందజేస్తున్న ఎస్‌ఐ హరిబాబు

జూలూరు వాసికి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబానికి చెందిన పాంకుంట్ల మహేశ్(29) రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. . రెండు రోజుల క్రితం టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ఉద్యానవన శాఖలో హార్టికల్చర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. అలాగే టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ విడుదల చేసిన ఫలితాల్లో ఫైర్‌మన్‌గా ఉద్యోగాన్ని సంపాదించాడు. పాంకుంట్ల మహేశ్ తల్లిదండ్రులు కిషన్, లలిత వ్యవసాయం చేస్తుంటారు. క మహేశ్ పదో తరగతి జూలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ పోచంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ మహబూబ్‌నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీలో చదువుకొన్నాడు. అనంతరం పీజీ, పీహెచ్‌డీ ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని ఇందిరాగాంధీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మహేశ్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలి

గరిడేపల్లి : బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ స్థితిగతులను అధ్యయనం చేయాలని కేవీకే ఇంఛార్జి సీనియర్ సైంటిస్ట్ డి.నరేష్ సూచించారు. సోమవారం కేవీకే గడ్డిపల్లిలో లయోలా అకాడమీ సికింద్రాబాద్‌కు చెందిన బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ విద్యార్థుల గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, మాధురి, కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

వలిగొండ : అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మండలంలోని సుంకిశాల సమీపంలో యాచకునిడిగా జీవిస్తుండేవాడు. దాహం వేయడంతో ఆ గ్రామ సమీపంలోని మెగా గ్యాస్ కంపెనీ పక్కన ఉన్న పొలాల వద్ద పొలానికి మందుకొట్టి పడవేసిన మందు డబ్బాలో మంచి నీళ్లు పట్టుకొని తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అతనిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య అందిస్తుండగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎంజీయూ వీసీకి ఓఎస్‌డీ నియామకం

ఎంజీ యూనివర్సిటీ (నల్లగొండరూరల్): మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీకి ఓఎస్‌డీగా అర్థశాస్త్రం విభాగం అధ్యాపకుడు కొప్పుల అంజిరెడ్డిని నియమిస్తూ సోమవారం వీసీ గోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కాలం పాటు ప్రత్యేక అధికారిగా ఆయన సేవలు అందిస్తారు.

అడిషనల్ కంట్రోలర్‌గా సంధ్యారాణి

యూనివర్సిటీ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యారాణిని నియమిస్తూ వీసీ గోపాల్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు ఆమె ఈ పదవిలో సేవలు అందిస్తారని తెలిపారు.


నియామక పత్రం అందజేస్తున్న వీసీ

ఉద్యాన పంటలను కాపాడుకుందాం ఇలా..

- దిగుబడులపై ఎండ తీవ్రత ప్రభావం చూపే అవకాశం
- మామిడికి పండు ఈగ ఆశించకుండా మందులు పిచికారీ చేయాలి
- పెద్దవూర ఉద్యానవన శాఖ అధికారి రవినాయక్ సూచనలు

పాడి పంట

పెద్దవూర: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతుంది. అందులో మామిడి, అరటి, నిమ్మ, బత్తాయి, జామ పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వేసవిలో తగిన జాగ్రత్తలు చేపట్టకపోతే ఆ చెట్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఆ ప్రభావం అరటి, మామిడి, బత్తాయి, నిమ్మ, జామ కాయలపై పడితే అవి దెబ్బతినే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వేసవిలో దిగుబడులు తగ్గకుండా పంటలను కాపాడుకోవచ్చునని ఉద్యానవన శాఖ పెద్దవూర మండల అధికారి బి.ర వినాయక్ సూచిస్తున్నారు. చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

మామిడి

మామిడి చెట్లు ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. ఈ పిందె రాలకుండా నిలబెట్టుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేటు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా నాలుగు లీటర్ల నీటికి 1 మిల్లీ లీటరు ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. దోమ వ్యాపించే అవకాశం కూడా ఉండటంతో దీని నివారణకు లీటరు నీటికి 0.5 మిల్లీ లీటర్ల కాన్ఫిడార్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ కాలంలో పండు ఈగ ఆశించే అవకాశం ఎక్కువ. దీని నివారణకు గాను తోటల్లో లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల మలథీయాన్, 2 మిల్లీలీటర్ల మిథైల్ యుజీనాల్ కలిపి ఎర ద్రావణం తయారు చేయాలి. తర్వాత ఒక్కో ప్లాస్టిక్ పళ్లెంలో 250 మిల్లీలీటర్లు ద్రావణాన్ని పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చు.


జామతోట


అరటి తోట


సపోట తోట


మామిడి తోట

అరటి

అరటిలో వైరస్ తెగుళ్లు వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. అవిశే లాంటి త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలల సగం పూర్తి అయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కసి వేయాలి. వేసవిలో గెలల రక్షణకు గెలలకు ఎండు ఆకులను చుట్టి ఎండ నుంచి రక్షించాలి. లేత గెలల తోటలో వడ గాలులకు ఆకులు పూర్తిగా మాడి పోయి ఎండిపోతాయి. అరటి గెలలు సరిగా తయారుగాక ఎండ వేడిమికి మాడిపోతాయి. ఇటువంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి. లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి, మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసి నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చు.

జామ

జామలో బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాలలో 5 మిల్లీ లీటర్ల డైక్లోరోఫాస్ లేదా కిరోసిన్ పోసి బంక మట్టితో పూడ్చాలి.

సపోట

లేత సపోట తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.

బత్తాయి, నిమ్మ

ఈ తోటలలో చెట్లపై మంగు నివారణకు లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి చెట్ల పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి. లీటరు నీటికి 20 గ్రాముల సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైనా, కాయలపైనా పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురు కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కుని ఎక్కువ కాలం ఉంటుంది.